# సుందరకాండ రహస్యాలు ప్రశ్నోత్తర మాలిక




***"శ్రీ గురుభ్యోనమః" విద్యార్థిని విద్యార్థుల సేకరణ***

[***www.gurujnanam.org***](http://www.gurujnanam.org)

విషయ సూచిక


| | |
|---|---|
| 1.ఉపోద్ఘాతం | 2 |
| 2.హనుమంతుని సముద్ర లంఘనం, లంకా ప్రవేశం | 3 |
| 3.సీతమ్మ వారి అన్వేషణ | 7 |
| 4.సీతమ్మ దర్శనం, త్రిజట స్వప్న వృత్తాంతం | 9 |
| 5.సీతా హనుమంతుల సంభాషణ | 11 |
| 6. హనుమంతుని శివ తత్త్వం | 15 |
| 7. లంకా దహనం | 17 |

## సుందరకాండ రహస్యాలు భాగం 1 - ఉపోద్ఘాతం

1. రహస్యము అని దేనిని అంటారు ?
జ. ధర్మ శాస్త్రం, మంత్ర శాస్త్రం , తత్త్వ శాస్త్రం , ఈ మూడింటిని రహస్యము అని అంటారు .

2. మంత్రము అంటే ఏమిటి ?
జ. దేవతలను స్పందింపచేసేది మంత్రము .



3. వాక్కు అంటే ఏమిటి ?
జ. వ్యక్తీకరించిన జ్ఞానము .

4. గుహ లో వానరులకి కనిపించిన ఋషిక పేరు ఏమిటి ?
జ. స్వయం ప్రభ .

5. హనుమంతుడు రామ లక్ష్మణులకు ఏ రూపము లో కనిపిస్తారు ?
జ. యతీశ్వరుడు .

6. హనుమ ఉపాసన చేస్తే ఏమి లభిస్తుంది ?
జ. రాముని సాంగత్యము .

7. రామాయణం ఎన్ని కాండలు ? సుందరా కాండ ఎన్నొది?
జ. రామాయణం 7 కాండలు, సుందరకాండ ఐదవది.

8 ) కార్య సిద్ధి లభించే శ్లోకం ఏమిటి ?
జ) తతో రావణనీతాయాః సీతాయాః శత్రుకర్శనః
ఇయేష పదమన్వేష్టుం చారణా చరితేపథి

## సుందరకాండ రహస్యాలు భాగం 2 - హనుమంతుని సముద్ర లంఘనం, లంకా ప్రవేశం

1 . సుందరకాండ అనే పేరులో సుందరంకి "తత్త్వ అర్ధం" ఏమిటి ?
జ. హృదయంలో వున్న పరబ్రహ్మను తెలుసు కోవడమే ఆనందం. అదే సుందరం.

2 .హనుమంతునికి పరాశర సంహిత లాంటి మంత్రశాస్త్రం లో వున్న నామం ఏమిటి ?
జ. సుందరుడు అనే నామం వుంది. అభయం ఆనందం జ్ఞానం ఇచ్చేవాడు కనుకనే ఆయన సుందరుడు.

3.బ్రహ్మ విద్య నేర్చుకోవడానికి కావాల్సిన అర్హతలు ఏమిటి ?
జ. నిత్యం అనిత్యం తేడా తెలుసుకోవాలి. ఇహలోక సుఖాలపై వైరాగ్యం కలగాలి. శమము, దమము అంటే అంతరేంద్రియ బాహ్యేంద్రియ నిగ్రహం ఉండాలి. తీవ్రమైన మోక్ష కాంక్ష ఉండాలి.



4 .సుందరకాండ మొదటి శ్లోకంలో చెప్పిన శత్రుకర్శనుడు ఎవరు? దీని తత్త్వ అర్ధం ఏమిటి ?
జ. శత్రు కర్శనుడు అంటే శత్రువులను అణిచే వాడు. శత్రువులు అంటే అంతర శత్రువులు. ఇంద్రియ నిగ్రహం కలవాడే శత్రు కర్శనుడు..

5 .సుందరకాండ లో హనుమంతుడు ఎన్ని కోణాలలో కనిపిస్తాడు?
జ.హనుమంతుడు సాధకుడిగా, సిద్ధుడిగా,ఆచార్యుడు గా కనిపిస్తాడు.

6 .సుందరకాండ ను ఎన్ని సంప్రదాయాలలో పారాయణ చేయవచ్చు?
జ. విష్ణు బ్రహ్మ విద్యగా, హనుమ విద్యగా మరియు శ్రీవిద్య సంప్రదాయంలో పారాయణ చేయవచ్చు .

7 .శ్రీ రాముడికి రెండు సార్లు హనుమ వల్ల చాలా మేలు జరిగింది,అవి ఎప్పుడు?
జ. సీత జాడ తెలిసినప్పుడు మరియు లక్ష్మణుని ప్రాణం నిలబెట్టినందుకు .

8 . ఆధ్యాత్మిక రామాయణం ఏమిటి ?
జ. రామాయణం లోని రహస్యాలు చెప్పేదే ఆధ్యాత్మిక రామాయణం.

9 . ఏ కార్యం చెయ్యాలన్న ఏయే లక్షణాలు కావాలి ?
జ. ఆత్మా విశ్వాసం మరియు ఈశ్వర విశ్వాసం


10 .సగరుడు హనుమంతునికి ఎందుకు సహాయం చెయ్యాలనుకున్నాడు ?
జ. సగరులు వల్లే సముద్రం ఏర్పడింది . వారి వంశం వాడయిన రాముని కార్యం మీద హనుమంతుడు బయలు దేరాడు కనుక సగరుడు సహాయ పడాలనుకున్నాడు.

11 .సగరుడు హనుమంతునికి సాయం చెయ్యమని ఎవరిని ప్రేరేపించాడు?
జ. మైనాకుడికి

12 .మైనాకుడు ఎవరు? ఆయనకు వాయు దేవుడు చేసిన సహాయం ఏమిటి?
జ. మైనాకుడు రెక్కలు గల పర్వతం. ఇంద్రుడు రెక్కలు గల పర్వతాల రెక్కలు కోసేస్తుంటే వాయు దేవుని ప్రార్థిస్తే ఆయన కాపాడాడు.

13 హనుమ మైనాకుడు ఆతిధ్యం ఇచ్చినప్పుడు ఏమి చేసాడు ? ఇది హనుమ యొక్క ఏ లక్షణానికి చెప్తోంది ?
జ. హనుమ మైనాకుని నిమిరి నువ్వు ఆతిధ్యం ఇచ్చినట్టే అని చెప్పాడు. వెంటనే తన ప్రయాణాన్ని కొనసాగించాడు. ఇది హనుమ కార్య దీక్ష గురించి చెప్తోంది

14 .రామాయణ ప్రారంభం లో పరమ శివుడు ఎవరిలా వస్తానన్నాడు?
జ. శివుడు సుందరుడిగా, తేజోమంతునిగా మరియు శక్తిమంతునిగా వస్తానన్నాడు. అదే హనుమ.



15 .సహాయం చెయ్యడం గురించి సనాతన ధర్మం ఏమి చెప్పింది?
జ. కృతేషు ప్రతి కర్తవ్యమ్ ఏష ధర్మ సనాతనః. చేసిన మేలుకు ప్రత్యుపకారం చెయ్యాలి.

16 . సురస ఎవరు?
జ. ఆమె దక్షుని పుత్రిక.నాగ మాత

17 .దేవతలు సురసను ఎందుకు పంపారు ?
జ. హనుమంతుడు ఆటంకం లేకుండా సముద్రం దాటితే లంకకు చేరుకొనే ముహూర్తం దుర్ముహూర్తం. అందుకే ఒక ముహూర్త కాలం అంతరాయం కలిగించడానికి ఆ తల్లిని పంపారు దేవతలు

18 .సురస హనుమంతునిని నోట్లో ప్రవేశించమంటే ఏమి చేసాడు ?
జ. చిన్నవాడయ్యి నోట్లో ప్రవేశించి బయటకు వచ్చాడు.

19 .హనుమంతుడు సురస నోట్లో ప్రవేశించి నప్పుడు ఏమి జరిగింది ?
జ. దేవతలు సురసాదేవి లోకి పంపిన శక్తి హనుమ లోకి ప్రవేశించింది.తమ వంతు సాయం దేవతలు హనుమకు చేసారు.

20 . సింహిక ఎవరు ?
జ. ఆమె ఛాయా గ్రాహిణి. నీడ పట్టుకుని హనుమని అడ్డుకుంటుంది.

21 . సింహిక హనుమంతునుని మింగగానే ఏమి అయ్యింది?
జ. హనుమ ఆమె లోపలి మర్మ స్థానములు నొక్కి వేసి ఆమెను వధించారు

22 . స్వామి దగ్గర వున్నా నాలుగు గుణాల వాళ్ళనీ స్వామి కార్యాన్ని సాధించారని దేవతలు స్తుతించారు . అవి ఏమిటి ?
జ. ధృతి, దృష్టి, మతి మరియు దాక్షం

23 .హనుమంతుడు సముద్రం దాటుతూ ఏఏ విద్యలు ప్రదర్శించాడు ?
జ.అష్ట సిద్ధులు

24 . హనుమంతుడు సముద్రం దాటుతూ ఎన్ని యోజనాలు ఎగిరాడు ?
జ. వంద యోజనాలు

25 . యోగపరమైన అర్థం చూస్తే హనుమంతుడు సముద్రం దాటుతున్నప్పుడు వచ్చిన అడ్డంకులు కుండలిని గమనం తో ఎలా పోల్చవచ్చు?
జ. బ్రహ్మ గ్రంధి మైనాకుడు, సురస విష్ణు గ్రంధి మరియు సింహిక రుద్ర గ్రంధి . వీటిని బేధించు కుంటూ ప్రాణ గమనం సహస్రారానికి సాగుతోంది

26 .జ్ఞాన పరంగా హనుమంతుడి పయనం ఎలా వర్ణించవచ్చు ?
మైనాకుడు సత్త్వ గుణం , సురస రాజో గుణం, సింహిక తమో గుణం త్రిగుణాలను దాటి బ్రహ్మ విద్య కొరకు సాధకుని ప్రయాణం

27 ఒక పాశ్చాత్యుడు రామాయణం గురించి చెప్పిన quote ఏమిటి ?
జ. Burn all the libraries but let there be Ramayana

28 . హనుమంతుడు లంక లోకి స్వేచ్ఛగా కాపలా దారులను దాటుతూ ఎలా ప్రవేశించాడు ?
జ.స్వామిని పరయంత్ర,పరతంత్ర మరియు దుష్టశక్తులు ఏమి చెయ్యలేవు.అందుకే సులువుగా ప్రవేశించాడు

29 . హనుమంతుడు లంక భటులను గమనిస్తూ వీరిని ఎలా గెలవచ్చు అనుకొన్నాడు?
జ. స్వామి సామ, దాన, దండోపాయాలలో వీరి దగ్గర సామ దానాలు పని చెయ్యవు దండోపాయమే మార్గం అనుకొన్నాడు.

౩౦.స్వామిని లంక ప్రవేశం తరువాత ఎవరు అడ్డుకొన్నారు ?
జ. లంకా నగర దేవత

31 . లంక నగర దేవత స్వామిని ఎలా ప్రాధేయపడింది ? ఇక్కడ చెప్పిన మనో దుఃఖ నివారణ మంత్రం ఏమిటి ?
జ. ఆమె : "ప్రసీద మహా బాహో. ప్రసీద ప్రసీద " అన్నది. ఇక్కడ చెప్పిన మనోదుఃఖ నివారణ మంత్రం " సంజీవ పర్వతోద్ధార మనో దుఃఖం నివారయ.
ప్రసీదసు మహా బాహోత్రాయస్వ హరి సత్తమ "

32 .సీతమ్మను హనుమ ఎప్పుడు చూసారు?
మార్గ శీర్ష మాసం శుద్ధ త్రయోదశి

33.చంద్రోదయం రామచంద్రుని అవతరణ తో వాల్మీకి మహర్షి ఎలా పోల్చారు?
జ. చంద్రుడు సముద్రం పొంగుతుండగా వచ్చాడు,అన్ని ప్రాణులను తన వెన్నెలతో ప్రకాశింప చేయడానికి వచ్చాడు, శ్రీ రాముడు సర్వ ప్రాణుల పాపములు పోగొట్టడానికి ఆనంద సముద్రం పొంగుతుండగా వచ్చాడు, అందరిలోను ఉండి స్వామి సర్వ భూతములను ప్రకాశింపచేస్తున్నాడు.

## సుందరకాండ రహస్యాలు భాగం 3 - సీతమ్మ వారి అన్వేషణ

1 . హనుమంతుడికి పుష్పకవిమానం ఎలా కనిపించింది ?
జ.భూమికి తగలకుండా గగనమండంలంలో ఎవరైనా మోస్తున్నారా అని.

2. పుష్పకవిమానం లో అంతఃపుర కాంతలతో నిద్రిస్తున్న రావణుడిని వాల్మీకి రామయణం, రంగనాథ రామయణం దేనితో పోల్చింది ?
జ.వాల్మీకి రామయణం నల్ల మినుముల కుప్పతో, రంగనాథ రామయణం వెన్నెల కప్పిన చీకటితో .

3.హనుమ ఎవ్వరిని చూసి సీతమ్మ అని భ్రమించాడు?
జ.మండోదరిని చూసి.

4. హనుమకు తనవల్ల ధర్మ లోపం జరిగిందా అని శంక ఎందుకు కల్గింది?
జ. వివిధ అవస్థలలొ ఉన్న స్త్రీలను చూసాడు  కాబట్టి.

5.ఏది ఉత్తమ పురుష లక్షణం?
జ.ఎప్పుడూ ఆత్మ పరిశీలన చేసుకోవటం.

6.వాల్మీకి గుర్తించిన హనుమ మూడు ప్రధాన లక్షణాలు ఏమిటి?
జ.మనస్వి, నిశ్చితఏకాంత చిత్తస్య, కార్యనిశ్చయదర్శిని.

7. వివేకానంద విద్య ని ఎలా  నిర్వచించారు ?
జ.విద్య సంపాదించుకునే సాధనం కాదు, వ్యక్తిత్వ నిర్మాణం చెయ్యాలి. అంటే శీలం, సత్యం, త్యాగం నేర్పేదే విద్య.

8. వివేకానంద వ్యక్తిత్త్వ  నిర్మాణానికి ప్రధాన గురువుగా ఎవ్వరిని పేర్కొన్నారు?
జ.హనుమంతుడు.

9. విద్యా  సంస్థలలో, కార్యాలయాలలో రాసిపెట్టుకోవల్సిన శ్లోకం ఏమిటి?
జ.అనిర్వేద శ్రియో మూలం అనిర్వేద పరం సుఖం
అనిర్వేదోహి సతతం  సర్వార్ధేషు ప్రవర్తకః.

10. హనుమాన్ స్వామిని ఎలా  వర్ణించారు?
జ.రామయణ మహా మాల రత్నంగా.

11. వేటిని దైవాలుగా గురువుగారు చెప్పారు?
జ.స్ఫురణ, అనుకూలత.

12. .అశోకవనంలోకి వెళ్తూ హనుమ పఠించిన దివ్యశ్లోకం ఏమిటి?
జ.నమోస్తు రామాయ సలక్ష్మణాయ దేవ్యై చ  తస్యై జనకాత్మజాయై
నమోస్తు రుద్రేంద్ర యమానిలేభ్యో నమోస్తు చంద్రార్క మరుద్గణేభ్యః.

13. సీత ధ్యానశ్లోకం  పఠించటం వలన ఏమి సిద్ధిస్తుంది?
జ.అసాధ్యం అనుకున్నవి సాధ్యం  అవుతాయి .

14. అశోకవనం వైపు వెళ్తున్న హనుమత్ స్వామి రూపాన్ని ఏమంటారు?
జ.ఆపదుద్ధారక హనుమాన్ మంత్ర మూర్తి, ఆ రూపం వెళ్లాకే సీతమ్మ దుఃఖం తొలగింది.

15. ఆపదుద్ధారక హనుమత్ స్వామి రుపాన్ని ఎలా వర్ణించారు?
జ.ఉత్తరీయం కప్పుకుని తోకపైకెత్తి ఎత్తినతోక చివరకు మడత పెట్టి, ఆ మడత తలపై పతాకంలా గోచరించిన రూపం.

16. అశోకవనంలో మండంపంపై కూర్చున్న సీతమ్మను ఏ విధంగా భావించాలి?
జ.వేద స్వరూపిణి అయిన త్రిపురసుందరి గా.

17. అశోకవనంలో కూర్చున్న సీతమ్మను ఏల వర్ణించారు?
జ.ఉపవాసాలతో కృశించి, నిట్టూరుస్తూ, దిగులుగా కూర్చున్నప్పటికి కూడా, నల్ల తాచులాంటి జడతో పొగకప్పిన నిప్పులా దివ్యకళతో ప్రకాశిస్తూఉంది.

18.ఆమెనే సీతమ్మగా హనుమ ఎలా పొల్చుకున్నాడు?
జ.సీతమ్మ ముఖంలోని ఆధ్యాత్మిక తేజస్సు చూసి, అలానే ఏ అభరణాలు మూటకట్టి పడివేసిన వాటిలో చూసారో ఆ అభరణాలు ఉండవల్సిన స్థలాలలో సీతమ్మగా మీద ఖాళీగా ఉండటం వలన అలానే అప్పుడు చూసిన చీరఖండ భాగం సీతమ్మ ధరించిన చీర ఒక్కటేలా ఉండటం వలన .

19. పతి ఉన్నవారు తియ్యకూడని అభరణాలు ఏమిటి?
జ.తాళి, మట్టెలు, చెవి కమ్మలు.

20. చెట్టు లోపల కాగిన హనుమత్ రూపాన్ని ఎల వర్ణించారు?
జ.హృదయంలో ఉండి కనిపించని ఆత్మలా, వేదాలలో ఉండి కనపడని బ్రహ్మపదార్థంలా.

21. రెండు నెలలు సీతమ్మకి గడువు ఇవ్వటంలో రావణుని జీవుని వేధన ఏమిటి?
జ.ఆ గడువు లో వచ్చి రాముడు తనని అనుగ్రహించాలని .

22. రావణుడు సీతమ్మను అంతఃపురంలో కాకుండా అశోకవనంలో ఉంచిన దాంట్లో ఆంతర్యం ఏమిటి?
జ.రావణుడు లోని జీవునికి ఆ తల్లి లక్ష్మిదేవి అని, రాముడు విష్ణుమూర్తి అని తెలుసుకుని, తాను కొల్చుకునే కైలాసంలోని తల్లికి, సీతమ్మకి భేదం చూడని లక్షణం ఆ జీవునిలో ఉందని

## సుందరకాండ రహస్యాలు భాగం 4 - సీతమ్మ దర్శనం, త్రిజట స్వప్న వృత్తాంతం

1. సీతమ్మ గరిక పట్టుకుని మాట్లాడటంలోని అంతరార్ధం ఏమిటి ?
జ: రెండు విధాలుగా చెప్పబడింది, 1. పరాయి మగవానితో ఏ అడ్డు లేకుండా మాట్లాడరాదు కాబట్టి 2. గరిక కి ఉన్న ప్రత్యేకత వినరానిది విన్నా, అనరానిది అన్నా, కనరానిది కన్నా గరిక స్పర్శ వల్ల దోష నివారణ జరుగుతుంది

2. రావణుడు సీతమ్మ చెప్పినదంతా విన్న తరువాత ఎంత గడువు పెడతాడు ?

జ: 2 నెలలు

3. సీతమ్మ ధైర్యం గా మాట్లడుతున్న సందర్భం వర్ణిస్తున్నప్పుడు వాల్మీకి మహర్షి అమ్మకి అంత ధైర్యం దేనివల్ల వచ్చిందని అన్నారు ?
జ: వృత్తం (character) వల్ల

4. అమ్మవారు రావణుడిని ఎందుకు తగలపెట్టలేదు ?
జ: రాముని సందేశం లేనందుకు, తన తపస్సు రక్షించుకోడానికి

5. రాముల వారికి తనకి కల బంధానికి సీతమ్మ ఏమి ఉపమానం చెప్పింది ?
జ: సూర్యునికి వెలుగు కి కల బంధం

6. సీతమ్మ చెప్పిన పది ప్రాతః స్మరణీయ దంపతులు ఎవరు ?
జ: ఇంద్రుడు- శచీ దేవి, వశిష్ఠుడు- అరుంధతి, చంద్రుడు- రోహిణి, అగస్త్య మహర్షి - లోపాముద్ర, చ్యవనుడు- సుకన్య, సత్యవంతుడు- సావిత్రి, కపిలుడు- శ్రీమతీ దేవి, సౌదాసుడు-మదయంతి, సగరుడు- కేశిని, నలుడు- దమయంతి

7. తనకి కల వచ్చిందంటూ, సీతమ్మ ని శరణు వేడడం ఉత్తమం అని చెప్పిన రాక్షసి స్త్రీ ఎవరు ?
జ: త్రిజట

8. త్రిజట స్వప్న వృత్తాంతం లో దాగి ఉన్న మంత్రం ఏది ?
జ: గాయత్రి

9. త్రిజట స్వప్న వృత్తాంతం లో రామచంద్ర మూర్తి వి ఎన్ని రూపాలు ఉంటాయి ?
జ: మూడు

10. త్రిజట స్వప్న వృత్తాంతం లో ఉన్న రామచంద్రమూర్తి 3 రూపాలు దేనికి సంకేతం ?
జ: గాయత్రి, సావిత్రి, సంధ్య అని చెప్పబడే త్రిసంధ్యా మూర్తి కి

11. స్వప్న శాస్త్రం రచించింది ఎవరు ?
జ: ఆత్రేయ మహర్షి

12. స్వప్న శాస్త్రం ప్రకారం స్వప్నాలని ఎన్ని రకాలుగా విభజించవచ్చు ? అవి ఏమిటి ?
జ: మూడు, 1. శారీరక రోగాలని తెలియచేసేవి 2. అంతఃకరణం లో దాగి ఉన్న అలోచనలు
3. సూచన కలలు

13. త్రిజట స్వప్న వృత్తాంతం లో రావణాదులు ఏ దిక్కు వైపు వెళ్తున్నారు ?
జ: దక్షిణం

14. త్రిజట స్వప్న వృత్తాంతం లో విభీషణుడు ఎలా కనిపించాడు ?
జ: తెల్లటి ఏనుగుపై చక్కటి అలంకరణలతో

15. త్రిజట ఆఖరుకి ఒక వానరం లంక తగలపెడ్తుంది అనగా, హనుమంతుని గురించి తెలియని రాక్షసి స్త్రీలు, వానరుల్లో ఎవరు ఈ పని చెయ్యగలరు అని భావిస్తారు ?
జ: వాలి

16. ఆంజనేయ స్వామి వారు సీతమ్మ కి ఎమి వినిపించాలి అనుకుంటారు ? ఏ భాషలో ?
జ: రామ కథ, మైథిలీ ప్రాకృతంలో

17. రామచంద్రమూర్తిని వర్ణిస్తున్న ఆంజనేయ స్వామి మొట్టమొదట దేనిని వర్ణించారు ? దాని ఆవశ్యకత ఏమిటి ?
జ: రామస్వామి నేత్రములను ఎందుకంటే భక్తులకి మొదట కరుణ వర్షించే స్వామి నేత్రాలే కనిపిస్తాయి.

18. హనుమంతుడు వర్ణించినదాన్ని పట్టి రామచంద్రమూర్తి పొడవు ఎంత ఉండవచ్చు ?
జ: 8 అడుగులు

19. అందరితో అర్చింపడే రాముని గుణం ని చెప్పే విష్ణు సహస్ర నామాల్లోని నామం ఏది ?
జ: అర్చిష్మాన్

20. హనుమంతుడి తండ్రి ఎవరు ?
జ: కేసరి మహరాజు

21. కేసరి మహరాజు ఏ పర్వతంపై నివసించేవారు ?
జ: మాల్యవంత పర్వతంపై

22. కేసరి మహారజు వధించిన రాక్షసుని పేరు ఏంటి ?
జ: శంబసాధనుడు
23. హనుమాన్ అనే నామం స్వామి తనకు ఎందుకు వచ్చిందని సీతమ్మతో చెప్తారు ?
జ: తాను చేసే పనులవల్ల తనకు హనుమాన్ నామం వచ్చింది అన్నారు.

## సుందరకాండ రహస్యాలు భాగం 5 - సీతా హనుమంతుల సంభాషణ

1 . భగవంతుని నామంలో ఉండే రెండు రకముల అర్ధములు ఏవి ?
జ. లీలార్థం, పరమార్ధం

2. మంత్రం లో ఉండే రెండు శక్తులు ఏవి ?

జ. శబ్ద శక్తి, అర్ధ శక్తి

3. హనుమాన్ నామార్ధం ఏమిటి ?
జ. గట్టి దవడలు కలవాడు

4. హనుమాన్ నామానికి తత్త్వ అర్ధం ఏమిటి ?
జ. కార్య సిద్ధి ప్రదాత, వాక్య కోవిదుడు, ఓంకార స్వరూపం, ప్రాణ శక్తి, అగ్నిహోత్ర శక్తి

5. హనుమాన్ కార్యసిద్ధి మంత్రం ఏమిటి ?
జ. శ్రీ హనుమాన్ జయ హనుమాన్ జయ జయ హనుమాన్ (4 సార్లు)

6. మన కంటికి, నాలుకకి, వాక్కుకి అధిదేవతలు ఎవరు ?
జ. కంటికి- ఇంద్రుడు, నాలుకకి - వరుణుడు, వాక్కు కి అగ్ని

7. యజ్ఞ ఆహుతులు దేవతలకి ఎలా అందుతాయి?
జ. అగ్ని ద్వారా ఆదిత్య మండలానికి, అక్కడ నుండి దేవతలకి అందుతుంది.

8. హనుమంతుడిని అగ్ని స్వరూపం గా ఎందుకు చెప్తారు?
జ. 1) హను శబ్దం వేదములలో వాక్కు కి వాడతారు, అదే అగ్ని స్వరూపం
2) అగ్ని యజ్ఞ దూత అయితే హనుమంతులవారు రామదూత

9. ఆంజనేయ నామార్ధం ఏమిటి ?
జ. అంజనా దేవి కి పుట్టినవాడు

10. ఆంజనేయ నామ తత్త్వ అర్ధం ఏమిటి?
జ. వేదం జనిత బ్రహ్మ జ్ఞానం. అంజన అనే ఔషధం కంటికి రాసుకుంటే మామూలు కంటికి కనిపించనివి కూడా చూడవచ్చు.

11. ఏ మూడు గుణముల వల్ల హనుమంతుడు రాక్షసులను అతి సులభంగా గెలవగలడు?
జ. విక్రమం, సమర్ధత, ప్రజ్ఞ

12. .రాముని ఉంగరం చూసిన సీత హనుమంతుని తో అడిగిన ప్రశ్న ఏది ?
జ. రాముడు క్షేమమేనా ? క్షత్రియ కర్తవ్యం పాటిస్తున్నాడా? రాజ నీతి పాటిస్తున్నాడా? మిత్ర బలాన్ని పెంచుకుంటున్నాడా ? నన్ను మర్చిపోయాడా ? ఇంత ఆలస్యం ఎందుకు అయ్యింది?

13. రాముడు సీతమ్మని తీసుకొని వెళ్ళడానికి ఎందుకు రాలేదు? హనుమ వర్ణించిన కారణం ఏమిటి?
జ. హనుమ అప్పుడు సీతమ్మ తో "ఆలస్యం ఎందుకు అయ్యింది అంటే అమ్మ , నువ్వు ఎక్కడ ఉన్నవో రామునికి తెలియక అమ్మ .

14. .రాముని విరహ వేదన గురించి హనుమ ఏమనెను?
జ. రాముని విరహ వేదన గురుంచి హనుమ ఇట్లు వర్ణించెను:
(అ). అమ్మ నీ విరహం లో రాముడు సరి అయిన ఆహారాన్ని, మధుర పదార్ధం గాని భుజించ లేదు.
(ఆ )ఎప్పుడయినా ఒక అద్భుత ఫలం గాని దృశ్యం గని చూస్తే, సీత ఇది చూస్తే ఎంత ఆనందిస్తుందో అనుకుంటాడు.
(ఇ). ప్రాణాధారణ కోసం ఫలం తిన్న శాస్త్రం ప్రకారం అయిదవ వంతు మాత్రమే తింటున్నాడు .
(ఈ) .శరీరం పైన క్రిములు , కీటకములు వాలిన పట్టించుకోవటం లేదు.



15. .రాముడు ప్రాణ ధారణ కోసం ఏమి తినేవాడని హనుమ చెప్పెను?
జ. ప్రాణాధారణ కోసం రాముడు ఫలములు తినెను.

16. .శాస్త్రం ప్రకారం ఆహారం ఎన్ని భాగాలూ గా విభజించాలి?
జ. శాస్త్రం ప్రకారం ఆహారం అయిదు భాగాలుగా విభజించాలి .

17.శాస్త్రం ప్రకారం విభజించిన ఆహరం ఎవరికీ నివేదించాలి అవి ఏంటి?
జ. దైవం కి మొదటి భాగం, పితృ నివేదన , అతిధి నివేదన ప్రాణి కోటి కి నివేదన, మానవునకు చివరి భాగం.

18.మానవుడు ఎన్నో వంతో భాగం ఆహరం తినవలెను?
జ. మానవుడు అయిదవ భాగం తినవలెను.

19.రాముడు నిద్రలో ఏమనేవాడు?
జ. రాముడు నిద్ర లో కూడా "సీత" అని ఉలికి పడెను.

20.సీతమ్మ చెప్పిన రాముని గుణములు ఎన్ని?
జ. ఏడు గుణములు.

21.సీతమ్మ వర్ణించిన రాముని గుణములు ఏమిటి వాటి అర్ధములు ఏమిటి?
జ. ఉత్సాహం - పని చెయ్యడానికి సర్వసన్నద్ధుడై వుండటము
పౌరుషం- ఉత్సాహం తో కూడిన ప్రయత్నం
సత్త్వం - దానికి తగ్గ బలం
అనుసంశ - క్రూరత్వం లేకపోవడం / అక్రూరత్వం
కృతజ్ఞత

విక్రమం - విక్రముడు
ప్రభావం - అవతల వారిపై తన బలం పని చేసేటట్టు చెయ్యడం.

22.రామునికి కోదండ రాముడు అని ఎందుకు పేరు వచ్చింది?
జ. కోదండం అనగా క్రీడా దండం అనగా రాములవారికి ధనుస్సు ఆట వస్తువు లాగా. రాముడు పరాక్రమ వంతుడు, ధనుర్విద్య లో ఉద్ధండుడు. పదునాలుగు వేల మంది రాక్షసుల ను ఒకే సారి బాణ పరంపర తో రాక్షస వేగాన్ని అంచనా వేసి కొట్టాడు.

23.సీతమ్మ బాధ చూసి హనుమ ఆమెతో ఏమననెను సీతమ్మ చెప్పిన సమాధానం ఏమిటి?
జ. సీతమ్మ బాధ చూసి హనుమ అమ్మ నా తో రా అమ్మ, రాముని దగ్గరికి తీసుకొని వెళ్తాను అనెను.

24..హనుమంతుడు దాల్చిన రూపం పేరు ఏమిటి ఎంత ఎత్తు ఎదిగాడు?
జ. హనుమ దాల్చిన రూపం వజ్రాంగబలి, గగన మండలం దాకా ఎదిగాడు.

25..హనుమ దాల్చిన రూపం లో ఎన్ని ముఖములు దాల్చెను?
జ. హనుమ దాల్చిన రూపం లో పంచ ముఖములు గలవు.

26. హనుమంతుడు దాల్చిన రూపముల పేర్లు ఏమిటి?
జ. పంచ ముఖముల పేర్లు :
వానర ముఖము , నరసింహ ముఖము , గరుడ వదనం , వరాహ వదనం , హయగ్రీవ ముఖము.

27.హనుమంతుడు దాల్చిన రూపం ఎన్ని దిక్కులు చూచెను అ దిక్కులా పేర్లు ఏమిటి?
జ. హనుమ దాల్చిన రూపం అయిదు దిక్కులు చూసేను , అవి తూర్పు , దక్షిణం , పశ్చిమ , ఉత్తరం , పైన గగనం .

28..పరమేశ్వరుని పంచ ముఖములు ఏమిటి?
జ. సద్యోజాత , వామదేవ , అఘోర, తత్పురుష , ఈశాన.

29.పంచ ముఖములు, ఏ ముఖము దేనికి ప్రతీక వివరించండి?
జ. వానర ముఖం- బలానికి శత్రు సంహారానికి ప్రతీక
నరసింహ ముఖం- రాక్షస శక్తులను నశింప చేసి సర్వానికి ఆధిక్యతని చెప్పే మహా స్వరూపం
గరుడ ముఖం- మహా వేగం తో దేనినయినా అతిక్రమించే తత్త్వం , టాక్సిన్స్ రోగాలను నశింప చేస్తుంది
వరాహ వదనం - ఉద్ధరణ శక్తి/ అన్న శక్తి. ఈ వదన ధ్యానం, సంపత్కరం
హయగ్రీవ ముఖం - జ్ఞాన స్వరూపం

30. హనుమ పంచ ముఖ తత్త్వం సుందర కంద లో ఎక్కడ ఎక్కడ చూపించారు?
జ. వానరుడిగా పుట్టారు ,అసుర సంహారం
నరసింహ అవతారం , వేగం లో గరుత్మంతుడు ,

సర్వ వేదములలో ప్రావీణ్యుడు  హయగ్రీవ రూపం , శోక సముద్రం లో ఉన్న అమ్మ ని ఉద్దరించిరి ఆ రూపం వరాహ రూపం .

31. వివేకానందులు సీతమ్మ గురించి చెప్పిన మాటలు ఏమిటి?
జ. ప్రపంచము లో అన్ని వాంగ్మయాలు అంతరించిన పరవాలేదు రామాయణం ఒక్కటి చాలు , రామాయణం కూడా అంతరించిన పరవాలేదు సీతమ్మ పాత్ర ఒక్కటి చాలు మొత్తం మానవ జాతి పునరుద్ధరణ అవుతుంది .

32.భారతీయ స్త్రీ /సీతమ్మ దీనికి ఉదాహరణ అని వివేకానందులు చెప్పారు?
జ. భారత  స్త్రీ పవిత్ర మూర్తి , ధైర్యం , నమ్మకం , ధర్మ నిష్ఠ , తేజస్సు కి ప్రతీక .

33.హనుమ మంగళ రూపం తీసుకున్న తరవాత సీతమ్మని తన భుజముల మీద కూర్చోమని చెప్పినప్పుడు సీతమ్మ ఏమనెను?
జ. సీతమ్మ తను రాముని తప్ప  మరి ఇతర పురుషులను తాకను అని చెప్పెను.

34.తనతో రమ్మన్నప్పుడు సీతమ్మ చెప్పిన కారణమునకు హనుమ ఏమనెను?
జ. హనుమ సంతోషించి , తాను ఆ విధం గా అడిగినందుకు నొచ్చుకుంటారు.

35.విశ్వనాధ కవి సీతమ్మ గొప్పతనం గురించి  ఏమి చెప్పిరి ?
జ. సీతమ్మ పాద ధూళి ప్రతి స్త్రీ పాపిట సింధూరం గా పెట్టుకోవాలి.

36. హనుమ పంచ ముఖ ములు ఏ ముఖము ఏ దిక్కు ?
జ. తూర్పు -వానర ముఖము
దక్షిణము -నరసింహ ముఖము
పశ్చిమం - గరుడ వదనం
ఉత్తరం - వరాహ వదనం
ఊర్ధ్వం - హయగ్రీవ ముఖం.

## సుందరకాండ రహస్యాలు భాగం  6 - హనుమంతుని శివ తత్త్వం

1  రామాయణంకు  ఆధార శక్తి ఎవరు?
జ.  హనుమాన్

2 . రామునికి చూడామణి చూసినప్పుడు గుర్తుకు వచ్చేది
ఎవరు?
జ. సీత యొక్క తల్లి, జనకుడు, దశరథుడు.

3 . సముద్రం దాటడానికి ముగ్గురికి మాత్రమే శక్తి ఉంది, వారు ఎవరు?
జ.గరుత్మంతుడు , వాయుదేవుడు , హనుమంతుడు .

4 . బీజకాండ అని దేనికి పేరు?
జ. సుందరకాండ

5 . సుందరకాండ కు మరి యొక్క పేరు ఏంటి ?
జ. హనుమత్ కాండ

6. గురువు ద్వారా ఉపదేశం పొందిన మంత్రము ఏమిటి?
జ. సిద్ధమంత్రం

7 రామాయణం లో రామాయణము చెప్పింది ఎవరు?
జ.హనుమ

8 . ప్రహిత అర్ధం ఏమిటి?
జ. అన్ని విధాలా హితం కలిగించు వాడు

9 నమో దూతాయచ ప్రహితాయచ అని ఎవరిని అందురు
జ.శివుడు

10 చూపుల్లో నిప్పు ఉన్నవాడు ఎవరు?
జ.శివుడు

11 శివుని మూడు నేత్రాల పేర్లు ఏమిటి?
జ.సూర్య నేత్రం , చంద్ర నేత్రం, అగ్ని నేత్రం

12 . సత్యం అనగా ఏమిటి?
జ. భూత హిత యదార్థ భాషణం

13 .సీతమ్మ కూర్చున్న వృక్షం పేరు ఏమిటి?
జ. శింశుపా

14 .మనలో సూర్య తేజస్సు ఏది?
జ.కన్ను, బుద్ధి

15 మనలో చంద్ర తేజస్సు ఏది?
జ. మనస్సు

16 మనలో అగ్ని తేజస్సు ఏది?
జ.వాక్కు

17 . వేధసే అనగా అర్ధం ఏమిటి?
జ. సృష్టి కర్త

18 శివాజీ పొందిన మంత్రం ఏమిటి?
జ. శ్రీరామ జయ రామ జయ జయ రామ

19 . జయం అనిగా ఏమిటి
జ.ధర్మ అర్ధ కామ మోక్షాలు సాధించటం

20 . హనుమంతునికి ఎన్ని సార్లు ప్రదక్షిణ చేస్తే కార్య సిద్ధి?
జ. 12 సార్లు

21 ఎవరి ప్రదక్షిణ చేయటం వలన గ్రహ దోషాలు పోతాయి?
జ. హనుమంతుడు , గణపతి

## సుందరకాండ రహస్యాలు భాగం 7 - లంకా దహనం

1. హనుమంతుడితో యుద్దానికి వచ్చిన విశిష్ట సేనాపతులు ఎందరు? పేర్లేమిటి ?
జ ఐదుగురు . విరుపాక్షుడు , వ్యూపాక్షుడు, దుర్ధర , ప్రగస , భాసకర్ణి.

2. వచ్చిన వాడు మాత్రం వానరుడు కాదు అని రావణుడు తనకు తెలిసిన మహాబలవంతులైన వానరుల పేర్లు చెప్పాడు? ఎవరు?
జ. వాలి ,జాంబవంతుడు ,నీలుడు,ద్విధుడు మొదలైనటువంటి మహావీరులు తెలుసు నాకు అంటాడు.

౩. రావణుడి పెద్దకుమారుడైన అక్షకుమారుడు హనుమాన్ తో యుద్ధమునకు వెళ్లనప్పుడు హనుమ ఎలా కనిపించాడు?
జ. ప్రళయకాలంలోసర్వము ధ్వంసం చేసిన రుద్రుడివలె.

4. హనుమ కొట్టిన దెబ్బకి అక్షకుమారుడు మళ్ళిపైకి ఎలా లేచాడు ?
జ. తపస్శక్తి సంపన్నుడైనటువంటి ఋషి తన భౌతికదేహాన్నివిడిచిపెట్టి సూక్ష్మ దేహంతో ఊర్ధ్వ లోకాలకు వెళ్తున్నట్లుగా.

5. ఆయుధం లేని హనుమ అక్షకుమారుడిని ఎలా సంహరించాడు ?
జ. కాలిపిక్కని పట్టి గిర్రున తిప్పి నేలకేసి కొట్టారు .

6. ఇంద్రజిత్తు హనుమ మీదకి ఏ అస్త్రం ప్రయోగించాడు ?
జ. బ్రహ్మాస్త్రము

7. బ్రహ్మాస్త్రానికి హనుమ బంధించబడ్డాడా ? ఏమిచేసాడు ?
జ . హనుమ ఏ అస్త్రానికి బంధించబడలేదు . బ్రహ్మాస్త్రాన్ని గౌరవించి బంధియైనాడు .

8. రావణాసురుని చూడగానే హనుమమంతుడుఏమనుకున్నాడు ?
జ . ఏం వర్చస్సు ,ఏమి ప్రతాపం సర్వ లక్షణములు ఉన్నాయి .అధర్మం లేకుండా ఉంటే ముల్లోకాలు ఏలవచ్చు.

9. హనుమంతుడిని చూసిన రావణుడు ఏమనుకున్నాడు ?
జ . కైలాసంలో నందిగాని ఇలావచ్చాడా , బాణాసురుడు గాని వచ్చాడా .

10. రావణాసురుడు వాలి కాళ్ళెందుకు పట్టుకున్నాడు ?
జ. వాలిని ఓడించాలని ఆలోచనతో అర్ఘ్యం ఇస్తున్న వాలిని వెనుకనుంచి పట్టుకున్న రావణుడిని చంకకింద పెట్టుకుని నాలుగు సముద్రాలలో అర్ఘ్యమిచ్చిన తరువాత పర్వతం దగ్గరకు వెళ్ళి దులిపితే కింద పడ్డాడు . అప్పుడు వాలి కాళ్ళు పట్టుకున్నాడు.

11. ప్రహస్తుడు హనుమతో నిన్నెవరు పంపించారు అనగా హనుమ సమాధానం ?
జ. రామ సందేశాన్ని సుగ్రీవుడు ఆజ్ఞాపించి పంపించ్చాడు, రామదూతగా వచ్చాను .

12. హనుమంతుడు రామదూతగా మాట్లాడిన మాటలు ఎలాఉన్నాయి ?
జ. నీతిమయం, హితంకలిగించేటట్లు, రాజసం ఉట్టిపడేటట్లు.

13. హనుమమంతుడు మాట్లాడిన మాటల సారాంశం ఏమిటి ?
జ. నీకిదివరకే తెలిసిన వాలిని ఒక్క బాణంతో కొట్టిన రామచంద్రమూర్తి సుగ్రీవునికి అభయం ఇచ్చాడు .ఆ రాముని భార్యని నీవు అపహరించావు .ఆ సీతమ్మని వెతకటానికి వేలకొలది వానరులు నలుదిక్కులా బయలుదేరాము .అంతరిక్షమందు ,భూమి యందు నీటి యందు వెతుకుతున్నారు .అలా వెతుకుతూ సీతమ్మని నేను చూడగలిగాను.

14. రావణుడిని ఏమని సంభోదిస్తూ మాట్లాడాడు హనుమ ?
జ. గొప్ప పండితుడా , నీకు తపఃశక్తులు, వరాలున్నాయి , ధర్మాలున్నాయి . అటువంటి నీకు పరస్త్రీని బంధించడం అధర్మం అని తెలియదా.

15. రావణునితో ఏ 3 లక్షణాలు ఉన్న పనులు చేయకూడదన్నాడు హనుమంతుడు ?
జ. ధర్మ విరుద్ధం, అనేక అపాయములు కలిగించేది, మూలాన్నే దెబ్బతీసేది.

16. లక్ష్మణుడి ప్రతాపం గురించి ?
జ. రాముని కోపాన్ని అనుసరించి ప్రయోగింపబడే లక్ష్మణుడి యొక్క బాణాలముందు దేవతలుగాని, అసురులుగాని నిలవలేరు .

17. రావణుడికి హనుమంతుడు ఇచ్చిన సలహా ఏమిటి ?
జ. రాముని యొక్క ప్రతాపం ముందు ముల్లోకాలలో ఏఒక్కరు కూడా నిలవలేరు . కాబట్టి నా మాట విని ఆ పురుషోత్తమునికి జానకీదేవిని అప్పగించు .

18. సీతమ్మవారి గురించి హనుమంతులవారు చెప్పిన విషయం ?
జ . సీతమ్మ మామూలు స్త్రీ కాదు. ఐదు పడగల మహా సర్పాన్ని ఇంట్లో పెట్టుకున్నావు . (పంచకృత్య పరాయణి) మహాశక్తి .సీతాదేవిని వశంచేసుకోవాలనుకున్నవాడు బ్రతకలేడు.సీతమ్మ తేజస్సుతో, రాముని కోపంతో లంకాదహనం మొదలైయింది.

19. రాముడే విష్ణువు అని సూచనగా ఎలా చెప్పాడు ?
జ. దైత్యులు కానీ దేవతలు కానీ , గంధర్వులు కానీ, నాగులు కానీ, యక్షులు కానీ ఎవరైనాసరే ముల్లోకాలకు ప్రభువైనటువంటి రామునితో యుద్ధం చేయటానికి సమర్థులు కారు.

20. రావణుడు హనుమంతుని చంపమన్నప్పుడు విభీషణుడు ఏమన్నాడు ?
జ . రాజనీతి ప్రకారం దూతని చంపరాదు. అంగవైకల్యమో, అవమానమో చెయ్యాలి కానీ చంపరాదు.

21. రావణుడు దూతని ఏవిధంగా శిక్షించామన్నాడు ?
జ . వానరులకి లాంగూలం అంటే ఇష్టం కనుక దానికి నిప్పంటించి బాజా భజంత్రీలతో ఊరేగించామన్నాడు.

22. రాక్షసస్త్రీలు సీతమ్మ వద్దకి వచ్చి హనుమ గురించి ఏమన్నారు ?
జ. నీతో మాట్లాడిన ఎర్రముఖంవాడి తోకకి నిప్పంట్టించారు.

23 . సీతమ్మవారు చేసిన ప్రతిజ్ఞ ?
జ . మంగళదిశకు తిరిగి నేను పతిసేవాపరాయణరాలనైతే , తపోమయమైన చరిత్ర
అయినట్లైతే, కళంకములేని పతివ్రతనైతే , రామచంద్రమూర్తి నాపై దయ ఉన్నట్లైతే ,



నాకేదైనా పుణ్యం ఉన్నట్లైతే, నేను పవిత్రురాలనని రాముని తప్ప మరియొక భావన నా హృదయంలో లేనిదాననైతే,,రాముని కోసం ఎదురుచూస్తున్నానని రాముడు నమ్మినట్లైతే ఓ అగ్ని! హనుమంతుడి పట్ల చల్లబడు.

24. తన తోకకి అగ్ని ఉన్నా తనకి ఏమి కాకపోవడం గురించి హనుమ ఏమి అనుకున్నాడు?
జ. ఇది అంతా రాముడి యొక్క ప్రభావము .కారుణ్యమూర్తి ,సుగుణాలరాశి , అయినటువంటి అమ్మ జానకమ్మ యొక్క అనుగ్రహం చేత ఏమి చేయలేదు .మా తండ్రిగారికి అగ్ని స్నేహితుడు కనుక నన్నేమి చెయ్యలేదు .

25. నిప్పంటించిన తోకతో నిలబడిన హనుమంతులవారు ఎలా కనడుతున్నారు ?
జ. సూర్యమండలం మధ్యలో పరంజ్యోతిలా ప్రకాశిస్తున్నట్లు.

26 . అగ్ని విభీషణుని ఇంటిని తాకకపోవటానికి కారణం ఏమిటి ?
జ . రావణుడికి అధర్మం ఎత్తి చూపిస్తూ తాను ధర్మబద్ధంగా జీవిస్తూన్నందుకు.

27 . ధర్మశాస్త్ర రహస్యం ఏమిటి ?
జ . శత్రువు మధ్యలోఉన్నా అగ్నిలో ఉన్నా యుద్ధం మధ్యలో ఉన్నా, మహాసముద్రం మధ్యలో ఉన్నా పర్వతం పైన ఉన్నా నిన్ను కాపాడేది ఇది వరకు చేసుకున్న ధర్మమే "ధర్మో రక్షతి రక్షితః ".

28 . లంకాపురిని తగులబెట్టిన నిలబడిన హనుమ ఎలా ఉన్నాడు ?
జ . త్రిపురాసుర సంహారము చేసిన పరమేశ్వరుడిలా.

29. బ్రహ్మ అనగా ఎవరు ?
జ ఎవరి వల్ల ఈ జగత్తు పుట్టి పెరిగి , చివరికి లయం అవుతుందో అతనే బ్రహ్మ.

౩౦. శివ తత్త్వము అనగా ఏమి ?
జ . అవ్యక్తం , అనంతం , అచింత్యం మాటకు అందనిది, ఏకము, అద్వితీయమై ఏది ఉన్నదో అదియే శివతత్త్వము.

31. మనుష్యుడికీ భగవానుడికి తేడా ఏమిటి ?
జ . మాయ ఆధీనం లో ఉండేవాడు మనుష్యుడు. మాయను ఆధీనములో ఉంచుకొని నామ రూపాలతో వ్యక్తం అయ్యేవాడు భగవానుడు.

32 . లంకాదహన అనంతరం ,సీతమ్మను గూర్చి హనుమ ఏమన్నాడు ?
జ . అగ్నిని అగ్ని ఏమి చెయ్యగలదు?

౩౩. సీతమ్మ ఎవరు ?
జ . అనింధనాగ్ని .

34. హనుమ యొక్క లాంగూలం ఎవరు ?
జ. శక్తి.

35. హనుమ యొక్క లాంగూలం లో ఏమేమి ఉన్నాయి ?
జ . జ్యోతిర్గణాలు , గ్రహాలు , జ్యోతిర్మండలాలు.

36. శివుడు రావణ సంహారానికి ఎవరిలా వస్తాను అని అన్నాడు ?
జ. సుందరుడిలా .

37. త్రిపురాసుర సంహారానికి నారాయణుడు ఎలా వచ్చాడు ?
జ. బాణంగా .

38. తోక పూజ ఎవరి పూజ ?
జ. శక్తి పూజ

39. ఎవరి కన్నీరు అమ్మవారు చూడలేదు ?
జ. పతివ్రతల కన్నీరు .

40. లంకనుండి తిరిగివచ్చిన హనుమ వానరులతో ఏమన్నారు ?
జ. సీతమ్మ నాచే చూడబడినది

41. suspense ,tension ఏ కళకు సంబంధించినవి ?
జ. నీచ కళ



42. ఉత్తమమైన కళలకు ఏమి ఉండవు?
జ. suspense

43. నా బుద్ధికి ఇలా తోస్తున్నది అని హనుమ ఎవరితో అన్నారు ?
జ. వానరవీరులతో

44. ఏదిక్కుకి తిరిగి నమస్కారం చేసి హనుమ మాట్లాడారు ?
జ. సీతమ్మ ఉన్న దక్షిణ దిక్కుకి .

45. వాలి , సుగ్రీవులు ఎవరి పుత్రులు ?
జ. ఋక్షరజుడు

46. సీతమ్మ ఇచ్చిన చూడామణిని హనుమ ఇవ్వగా రాములవారికి ఎవరు స్ఫురణ కు వచ్చారు?

జ. జనకుడు  జనకుడి భార్య , దశరథుడు ,కౌసల్య , సీతమ్మ వందనం,  సీతమ్మ పాపిట

47. జనక  మహారాజుకి  చూడామణి ఎలా లభించింది?
జ . జనక మహారాజు యజ్ఞం చేస్తూ ఉండగా దివ్యమైన సాగరమధనం జరుగుతున్నప్పుడు ఉద్భవించిన మణి ఇంద్రుడు జనకమహారాజుకి సీతమ్మ కల్యాణానికి కానుకగా ఇచ్చారు

48 . సీతమ్మ దర్శనం చేసిన హనుమని రాములవారు  ఏ విధంగా ప్రశంసించారు ?
జ . హనుమ  చేసిన ఈ పనిని  ఊహలో కూడా  ఎవరు చెయ్యలేరు .హనుమ చేసిన పనికి ప్రత్యుపకారం నేను ఏమి చెయ్యగలను?

49 . రాముల వారు హనుమని కౌగలించుకున్నప్పుడు ,మూర్తి ఏది ?
జ.  హరిహరాత్మకమైన హనుమద్రామమూర్తి .

50. ఇంద్రజిత్తు  వేసిన అస్త్రం  ఎవరి మీద  పని చెయ్యలేదు?
జ. హనుమంతుడు, విభీషణుడు, జాంబవంతుడు.
51 . ఎవరు బ్రతికి  ఉంటే, అందరూ బ్రతికినట్టు అని జాంబవంతుడు అన్నాడు ?
జ. హనుమ

52 . హనుమ ఎన్ని  మార్లు  సంజీవని పర్వతాన్ని  తెచ్చాడు ?
జ . రెండు మార్లు.

53 . సంజీవని పర్వతాన్ని ఎత్తిన రూపం ఏది ?
జ. ఆరోగ్యప్రదాత, ప్రాణ దాత.

54 . రావణ, కుంభకర్ణలు , ఎవరి చేతిలో హతం అయ్యారు ?
జ .రామచంద్రమూర్తి చేత .

55 . రామ పట్టాభిషేక ప్రక్రియ లో అంతరార్థం ఏమిటి ?
జ. రామా  మా బ్రతుకు మేమే ఏలుకుంటున్నాం అనే అజ్ఞానాన్ని పోగొట్టి .మా బ్రతుకు నువ్వు ఏలుతున్నావు అనే  జ్ఞానాన్ని ఇవ్వు .

56 . రామ పట్టాభిషేకానికి ఎవరు ఎవరు వచ్చారు ?
జ . బ్రహ్మర్షులు , ప్రచ్ఛన్న  రూపాలతో ఇంద్రుడు, శచీదేవి, ఇతర దేవతలు  వచ్చారు.

57. ఇంద్రుడు రామపట్టాభిషేక అనంతరం ఏ మాలని కానుకగా పంపాడు ?
జ . బంగారు పద్మముల మాల.

58 . రాములవారికి బంగారు కిరీటాన్ని అలంకరించింది ఎవరు ?
జ. వశిష్ఠుల వారు .

59 .ఇక్ష్వాకు వంశానికి ప్రధమ చక్రవర్తి ఎవరు ?
జ . వైవశ్వత మనువు

60 . రాముడికి అలంకరించిన కిరీటం ఎవరు తయారు చేసారు ?
జ . బ్రహ్మ గారు , సూర్య మండల తేజస్సు నుండి కిరీటాన్ని తయారుచేసి వైవశ్వత మనువు కి అలంకరించారు. అప్పటి నుండి పరంపరగా రాముల వారి వరకు వచ్చింది.

61 . సీతారాములు పట్టాభిషేక అనంతరం హనుమకు ఏమి కానుక ఇచ్చారు ?
జ. ముత్యాల హారం .

62 . సీతమ్మకు ఆ ముత్యాల హారం ఎవరు తయారు చేసి ఇచ్చారు ?
జ . సీతమ్మ యొక్క పుట్టింటి వారు మరియు అత్తింటి వారు.

63 . రామాయణం ఏ ఘట్టంతో ముగిసింది ?
జ. హనుమ యొక్క సన్మానంతో.

64 .రామ పాలనలో ప్రజలందరూ ఎలా జీవనం సాగిస్తున్నారు ?
జ. ధర్మబద్ధంగా , ఆనందంగా ఉన్నారు .

65. ఎప్పుడు రామ చింతనాపరులు ఎవరు ?
జ. అయోధ్య వాసులు .

66 . ఎప్పుడూ రామ భావన చేసేవారికి ఎలాంటి ప్రవృత్తి ఉండదు?
జ . హింసాప్రవృత్తి .

67 .రామ కధాశ్రవణం వల్ల ఏమి లభిస్తాయి ?
జ . ఇహపర సౌఖ్యములు

68. తారకము అంటే ఏమిటి ?
జ. ఓంకారము

69 . పరమాత్మకు, ఓంకారమునకు నిర్దిష్టముగా ఏమి లేవు ?
జ . నామ రూపాలు

70 . ఓం అనేది ఏమి తెలియచేస్తుంది ?
జ . బ్రహ్మ ,విష్ణు ,శివాత్మకమైన పరమాత్మ తత్త్వమును తెలియచేస్తుంది.

71 . ఓంకారమును ఎన్ని భాగములుగా విభజించే సాంప్రదాయం ఉంది ?
జ. మూడు, ఐదు మరియు ఎనిమిది గా విభజించే సాంప్రదాయం ఉంది .

72 . ఓంకారంలోని ఎనిమిది భాగాలు ఏవి ?
జ . అకార, ఉకార , మకార ,బిందు ,నాద , కళ , కాలాతీత , తత్పర.

73 . ఓంకారములో ఎన్ని స్థూలములు ఎన్ని సూక్ష్మ భాగములు ?
జ . మూడు స్థూలములు ఐదు సూక్ష్మాలు .

74 . ఓంకారంలో ఒక్కొక్క భాగానికి అధిదేవతలు ఎవరు ?
జ . అకారం - బ్రహ్మ (జాంబవంతుడు) , ఉకారం - సూర్యుడు ,ఇంద్రుడు (వాలి, సుగ్రీవులు) , మకారం -సూర్యుడు (హనుమంతుడు) , బిందు - చక్రం (శత్రుఘ్నుడు) , నాదం - పాంచజన్య శంఖం (భరతుడు) కళ - లక్ష్మణుడు , కళాతీత -సీతమ్మ, తత్పర - రాముడు.

75 . పట్టాభిరామమూర్తి ఎవరికి యొక్క సాకారము?
జ . ఓంకారం

## ప్రవచనంలో వివరించిన హనుమద్మూర్తులు

అభయాంజనేయుడు
యోగాంజనేయుడు
వీరాంజనేయుడు
ఆనందాంజనేయుడు
అద్భుతాంజనేయుడు
ఆపదోద్ధారక హనుమద్మంత్ర మూర్తి
క్షిప్రాంజనేయుడు
జ్ఞానాంజనేయుడు
విరాడాంజనేయుడు
ప్రసన్నాంజనేయుడు
ప్రతాపాంజనేయుడు




This is a rare portait of SRIRAMA PATTABHISHEKAM. Wishing this should reach as many people as possible before SRIRAMA NAVAMI . Pl join us in this HANUMAN MISSION and get the blessings of HANUMAN.

వామే భూమి సుతా పురశ్చ హనుమాన్ పశ్చాత్ సుమిత్రా సుతః
శత్రుఘ్నో భరతశ్చ పార్శ్వ దళయోః వాయ్వాది కోణేషుచ
సుగ్రీవశ్చ విభీషణశ్చ యువరాట్ తారాసుతో జామ్బవాన్
మధ్యే నీల సరోజ కోమలరుచిం రామం భజే శ్యామలం

## శ్రీ రామ జయ రామ జయ జయ రామ

## శ్రీ హనుమాన్ జయ హనుమాన్ జయ జయ హనుమాన్

### శ్రీ గురువుగారి ఆశీస్సులతో

Contribution from April 2017 ‘’Murali’’

| | |
|---|---|
| Santhi Akella | - California |
| Madhuri Vithala Murthy | - North Carolina |
| Satyasri P. Vepa | - North Carolina |
| Madhu Mahankali | - California |
| Preethy  Balasubramanian | - North Carolina |
| Suneetha Kaligotla | - North Carolina |
| Prathibha Kandiraju | - West Virginia |
| Venkata P Achanta | - North Carolina |

Edited by

| | |
|---|---|
| Vidya Tadanki | - California |
| Preethy Balasubramaniam | - North Carolina |
| Padma Vennelakanti | - North Carolina |
| Madhu Mahankali | - California |
| Satya Venkata Kumar Malyala | - Australia |

### సర్వం శ్రీ సీతారామాంజనేయ చరణారవిందార్పణమస్తు